నేడు శింగనమలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నేడు శింగనమలలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా తనతోపాటు జాయింట్ కలెక్టర్, డిఆర్ఒ, అన్నిశాఖల జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు తెలిపారు. కావున నియోజకవర్గ ప్రజలు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాస్థాయిలో ఇక్కడ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో ఈ కార్యక్రమం నిర్వహించడం లేదన్నారు. కావున ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

కరువును చూసేందుకు ఇప్పుడా..!

8న కేంద్ర కరువుబృందం పర్యటన

'దొంగలు పడ్డ ఆరు మాసాలకు...' అన్న నానుడికి కేంద్రకరువు బృంద పర్యటన సరిగ్గా సరిపోతోంది. రబీ సీజన్ కూడా ముగుస్తున్న సమయంలో కేంద్ర కరువు బృందం జిల్లా పర్యటనకు రానుంది. ఈనెల ఎనిమిదవ తేదీన అనంతపురం జిల్లాలో పర్యటించనుంది. ఈ మేరకు షెడ్యుల్ ఖరారైనట్టు సమాచారం. 2024 ఖరీఫ్‌లో నెలకొన్న కరువును ఈ బృందం పరిశీలించనుంది. అనంతపురం రూరల్ మండలంలోని మన్నీల గ్రామంలోని పొలాల్లో పర్యటించి పంట పరిశీలన చేయనుంది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జిల్లాలో 2024లో కరువును రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరు మాసంలో ప్రకటించింది. ఇందులో రెండు మండలాల్లో తీవ్రమైన కరువు నెలకొందని ప్రకటించింది. నార్పల, అనంతపురం రెండు మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయని ప్రకటించింది. బుక్కరాయసముద్రం, గార్లదిన్నె, రాప్తాడు, విడపనకల్లు, యాడికి ఈ ఐదు మండలాల్లో మధ్యస్థంగా కరువు ఉన్నట్టు నిర్ధారించింది. ఇందులో మొత్తం 12856 హెక్టార్లలో పంటనష్టం వాటిల్లినట్టు అధికారులు అంచనా వేశారు. దీనికి రూ.19.98 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ అవసరమని ప్రతిపాదించారు. ఇందులో అత్యధిక నష్టం వేరుశనగ పంటనే ఉంది. వేరుశనగ పంట నష్టానికి సంబంధించి 7796 హెక్టార్లకుగానూ రూ.13.25 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రతిపాదించారు. పత్తి పంట 2849 హెక్టార్లకు రూ.4.84 కోట్లు, ఆముదం 1500 హెక్టార్లకు రూ.1.27 కోట్లు, 361 హెక్టార్లలో జొన్న నష్టానికి రూ.30 లక్షలు, 20 ఎకరాల్లో పెసరకు రూ. 2 లక్షలు, 327 ఎకరాల్లో కొర్ర పంటకు రూ.27 లక్షలు ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రతిపాదించారు.

కరువు మండలాల పున: సమీక్ష నిర్ణయం ఏమైందో ?

కరువు మండలాల ప్రకటనలో హేతుబద్దలేదని, పున:సమీక్షించాలని నవంబరులో జరిగిన జిల్లా అభివృద్ధి కమిటీ సమావేశంలో తీర్మానించారు. అధికారపార్టీకి చెందిన నేతలే దీన్ని ముందుకు తీసుకొచ్చారు. అయితే తరువాత దీనిపై అధికారులు ఏ రకమైన చర్యలు తీసుకున్నారన్నది తెలియలేదు. కీలకమైన ఆగస్టులో వర్షాభావంతో పంటలు బాగా దెబ్బతిన్నాయని, అన్ని మండలాలను కరువు మండలాలు ప్రకటించాలని విపక్షాలు కూడా డిమాండ్ చేశాయి.

పర్యటన సాగునుంది ఇలా...

కేంద్ర కరువు బృందం ఈనెల ఎనిమిదవ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు సత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం పర్యటన ముగించుకుని అనంతపురం రూరల్ మండలం మన్నీల గ్రామానికి వస్తుంది. అక్కడ ఆముదం పంటను అధికారులు పరిశీలిస్తారు. అనంతరం 2.30 గంటల నుంచి బయలుదేరి రాప్తాడు మండలంలోని రాప్తాడు గ్రామం చేరుకుంటారు. అక్కడ నుంచి ఐదు గంటలకు పంట పరిశీలన అనంతరం బెంగళూరుకు వెళతారు.

'అనంత'లో ప్రశాంత వాతావరణం నెలకొల్పాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్

ప్రజాశక్తి - గుత్తి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రశాంత వాతావరణ నెలకొల్పాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. గుత్తి పట్టణంలోని జెడ్. వీరారెడ్డి భవనంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హంద్రీనీవా సుజల స్రవంతి సాగునీటి ప్రాజెక్టు నుంచి కృష్ణా జలాలు జిల్లాలో ఒక ఎకరాకు కూడా తడవడం లేదన్నారు. జిల్లాలోని ప్రతి ఎకరాకు కృష్ణా జలాలను అందించాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష పార్టీ నాయకులు సోషల్ మీడియాలో పోస్టులు పెడితే వారిపై కేసులు నమోదు చేస్తున్న పోలీసులు అధికార పార్టీ నాయకులు మహిళలపై అసభ్యకరంగా పోస్టులు పెడుతుంటే ఎందుకు కేసులు పెట్టడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో మత రాజకీయాలు నడుస్తున్నాయని విమర్శించారు. జెసి.ప్రభాకర్ రెడ్డి నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో మహిళలు బురఖాలు ధరించి వస్తారని మతాల గురించి గురించి బిజెపి నాయకులు అనడం తగదన్నారు. జెసి.ప్రభాకర్ రెడ్డి తమ బస్సులను బిజెపి నాయకులు తగలబెట్టారని అనడంతో ఆయనపై రాష్ట్ర మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రతి ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ప్రతిదానికి స్పందించే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జిల్లాలో ఇంత వివాదం నడుస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. జెసి బస్సులు కాలిన ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి. శ్రీనివాసులు, నాయకులు కసాపురం రమేష్, సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల, బి.రామకృష్ణ, కార్యదర్శి ఎన్. రేణుక, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. రాంభూపాల్

రైల్వే అభివృద్ధికి సహకారం

రైల్వే, జలశక్తి సహాయ మంత్రి వి. సోమన్న

సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర సహాయమంత్రి సోమన్న

ప్రజాశక్తి-పెనుకొండ

తెలుగు రాష్ట్రాల్లో రైల్వే అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని కేంద్ర రైల్వే, జలశక్తి సహాయ మంత్రి వి. సోమన్న అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలో రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి, సంక్షేమం, జౌళి శాఖ మంత్రి సవిత, హిందూపురం ఎంపీ బికె.పార్థసారథి, ఎమ్మెల్సీ మంగమ్మ, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, జిల్లా కలెక్టర్ టిఎస్. చేతన్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, రైల్వే చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అజయ్ శర్మ, అమితేష్ కుమార్ , బెంగళూరు డివిజనల్ రైల్వే మేనేజర్, అడిషనల్ డివిజనల్ రైల్వే మేనేజర్, వివిధ రైల్వే విభాగాలకు చెందిన అధికారులు, కూటమి నాయకులు, రైల్వే ఉద్యోగ కార్మిక సంఘాల నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి సోమన్న మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అంటే అభివృద్ధికి నిర్వచనం అని అన్నారు. ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన శ్రీకష్ణదేవరాయ కాలంనాటి రెండవ రాజధానిగా ఉన్న పెనుకొండలో ఈ కార్యక్రమంలో పాల్గొనడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ఎన్డీఏ ప్రభుత్వం పని చేస్తోందని, ప్రస్తుతం ఈ వంతెన పెనుకొండ పట్టణం అనంతపురం ధర్మవరం, పుట్టపర్తి మధ్య రైల్వే ట్రాక్ మీదుగా రోడ్డు రాకపోకలకు అతుకులు లేకుండా సులభంగా ఉంటుందన్నారు. నేటితో పెనుకొండ వాసుల చిరకాల కోరిక నెరవేరిందని మంత్రి పేర్కొన్నారు. 2021 మార్చి 15 న రూ.33.50 కోట్లతో 63.4 మీటర్లు అనంతపురం వైపు 443 మీటర్లు, పెనుకొండ వైపు 130 మీటర్ల అప్రోచ్ పొడువుతో ఈ వంతెన నిర్మాణం ప్రారంభించామని నేడు ఇది ప్రజలకు ఉపయోగంగా ఉందని తెలిపారు. పెనుకొండలో రూ.20 కోట్ల రూపాయలతో గూడ్స్ నిర్మాణానికి పరిపాలన అనుమతి, రూ.3 00 కోట్లతో పెనుకొండ నుండి మక్కాజి పల్లి డబ్లింగ్ పనులు పురోగతిలో ఉన్నాయని అన్నారు. చాకర్లపల్లి వద్ద వంతెనను నెల రోజుల్లో ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. చాకర్లపల్లి వద్ద అసంపూర్తిగా ఉన్న పనులు, పెనుకొండ ఆంజనేయస్వామి దేవస్థానం వద్ద అవసరమైన పనులకు 30 రోజుల్లో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రైల్వే శాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. హిందూపురం ఎంపీ పార్థసారథి, మంత్రి సవిత, పుట్టపర్తి ఎమ్మెల్యేపల్లెసింధూర రెడ్డి అభ్యర్థనలను మంత్రి స్పందించి ఆయా ప్రాంతాలలో కూడా సత్వరమే రైల్వే అభివృద్ధి పనులను ప్రారంభించడం జరుగుతుందన్నారు.

రైల్వే మంత్రికి సన్మానం : పెనుకొండ రైల్వే బ్రిడ్జి ప్రారంభోత్సవానికి వచ్చిన రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్నను త్రిపుర రిసార్ట్స్ యజమాని డాక్టర్ గోపీనాథ్ ఘనంగా సన్మానించారు. మంత్రి సోమన్న, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, హిందూపురం ఎంపీ పార్థసారథిలకు శాలువాలు కప్పి గజమాలతో సన్మానించారు. మంత్రి సోమన్నకు పెనుకొండ ప్రాంత సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, రవి, హనుమంతు యాదవ్, మండల కార్యదర్శి అమత, బాలగోపాల్, హరిలాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే జోన్ ఏర్పాటు చేయాలి : రాష్ట్రంలో రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని, పెనుకొండ రైల్వే జంక్షన్‌ను అధునాతనంగా తీర్చి దిద్దాలని బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు ,హైకోర్టు న్యాయవాది శివరామకష్ణ, డీవీఎంసీ మెంబర్ రామాంజినప్ప కోరారు. ఈ మేరకు వారు మంత్రి సవిత,హిందూపురం ఎంపీ బి. కె. పార్థసారథి సమక్షంలో కేంద్ర మంత్రికి వినతి పత్రం సమర్పించారు. సుదూర ప్రాంతాల మధ్య తిరిగే రైళ్లలో పేద, దిగువ మధ్య తరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకొని సాధారణ భోగీలను పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో బహుజన చైతన్య వేదిక ప్రధాన కార్యదర్శి రవికుమార్, రాంపురం రామాంజనేయులు, రంగేపల్లి కదిరప్ప, కోనాపురం కొల్లప్ప, శెట్టిపల్లి నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్ ఆధునికరణకు చర్యలు

పుట్టపర్తి రూరల్: పుట్టపర్తి రైల్వే స్టేషన్ ఆధునికరణ,కొత్తచెరువు రైల్వే అండర్ బ్రిడ్జి రోడ్డును ఫ్లైఓవర్ బ్రిడ్జిగా మార్చాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కేంద్ర సహాయ మంత్రి సోమన్నకు వినతిపత్రం అందజేశారు. ఆదివారం పెనుగొండ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి ప్రారంభోత్సవానికి హాజరైన మంత్రి సోమన్నను పుట్టపర్తి భగవాన్ శ్రీ సత్యసాయిబాబా మహా సమాధి దర్శనార్థం పుట్టపర్తికి రావాలని ఎమ్మెల్యే ఆహ్వానించారు. పుట్టపర్తికి వచ్చిన కేంద్ర సహాయ మంత్రిని పుట్టపర్తి ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్‌లో ఘన స్వాగతం పలికారు . ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్ను ఆధునికరించాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి లు కోరారు. ఈ సందర్భంగా రైల్వే మంత్రికి టిడిపి జిల్లా నాయకులు సామకోటి ఆదినారాయణ సత్యసాయి చిత్రపటాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మాధవీలతకు క్షమాపణ

మిగిలిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నా... తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

'నటి మాధవీలతపై తాను చేసిన వ్యాఖ్యలకు చింతిస్తున్నా... ఆవేశంలో నోరుజారా.. ఆమెకు బేషరతుగా క్షమాపణ చెబుతున్నా.' అని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. అయితే బిజెపి నాయకులపై చేసిన మిగిలిన వ్యాఖ్యలకు తాను కట్టుబడి ఉన్నా అని చెప్పారు. ఈ మేరకు ఆయన ఆదివారం స్థానిక మీడియాతో మాట్లాడారు. ఒక మహిళ పట్ల ఆ రకంగా మాట్లాడి ఉండకూడదని భావిస్తున్నానని అన్నారు. అయితే ఫ్లెక్సీగాళ్లు, బ్యానర్‌గాళ్లు తనపై మాట్లాడాన్ని అంగీకరించనన్నారు. తాను ఏ పార్టీలో చేరాలన్నది చెప్పడానికి సత్యకుమార్ ఎవరని అన్నారు. చంద్రబాబునాయుడి విజన్ నచ్చి తాను టిడిపిలో ఉన్నానని అన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని తాడిపత్రి పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నానని చెప్పారు. తాడిపత్రి ప్రజల అండ తనకు పుష్కలంగా ఉందన్నారు. ఎక్కడి నుంచో వచ్చిన వారు కూడా తన గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. వారికి పదవులు పోతే ఇక్కడ మాట్లాడే వారు ఉండరని అన్నారు. తాను మాత్రం తాడిపత్రి ప్రజలకు మేలు చేయడానికి కృషి చేస్తానని చెప్పారు.

ప్రయివేట్ పాఠశాలల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కొత్తపల్లి బాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా కళ్యాణదుర్గం శ్రీ చైతన్య పాఠశాల కరస్పాండెంట్ కొత్తపల్లి బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కళ్యాణదుర్గం వ్యాయామ ఉపాధ్యాయులు, మిత్రులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు రాజగోపాల్, శ్రీనివాసులు యాదవ్, ఇబ్రహీం, రాజేంద్ర, పనిరాజు, మోహన్ లు పాల్గొన్నారు.

కొత్తపల్లి బాబును సన్మానిస్తున్న కళ్యాణదుర్గం వ్యాయామ ఉపాధ్యాయులు, మిత్రులు

మతోన్మాదమే బిజెపి అజెండా

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

మతోన్మాదమే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ అజెండా అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. ఆదివారం కుందుర్పి మండల ంలోని బెస్తరపల్లిలో అమరవీరుల స్తూపాన్ని రామ కృష్ణ ఆవిష్కరించారు. అంతకుముందు కళ్యాణ దుర్గం, తూముకుంట, బెస్తరపల్లిలో ఎఐఎస్ఎఫ్, ప్రజాసంఘాల నాయకులు బైక్‌ర్యాలీలతో స్వాగతం పలికారు. సీనియర్ నాయకులు ఓబులపతి బీకే గోపాల్ అధ్యక్షతన బెస్తరపల్లిలో అనంతరం ఏర్పా టు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్రోద్యమానికి పూర్వం భూ పోరాటాలు, పెత్తందారులు, రజాకార్లకు వ్యతిరేకంగా బ్రిటిష్ పాలనకు ఎదుఖెడ్డి నిలిచిన భారత కమ్యూనిస్టు పార్టీకి వందేళ్లు పూర్తయిందన్నారు. మరో వందేళ్లయినా చరిష్మా తగ్గకుండా ఉద్యమాలు చేస్తూనే ఉంటామన్నారు. అమరవీరుల పేరు మీద బెస్తరపల్లిలో జరుగుతున్న కార్యక్రమం చరిత్రలో నిలిచిపోతుందని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా గత వందేళ్లుగా జరుగుతున్న భూ పోరాటాల్లో ప్రాధాన్యత సంతరించుకున్న బెస్తరపల్లి భూ పోరాటంలో పేదలకు 45 వేల ఎకరాల భూమి పంచిన ఘనత ఇక్కడ నాయకత్వానికి దక్కుతుందని ఐదుల్లు సదాశివన్, బంగి ఎర్రిస్వామి, బంగి రామప్ప పిఎస్ శర్మ, బిటి రామన్న, గోవిందప్ప, చెట్ల రుద్రప్ప, లింగన్న, నాగిరెడ్డి , నారాయణరెడ్డి, తిమ్మప్ప తదితరులకు దక్కుతుందన్నారు. రాయల్ నేవీ తిరుగుబాటు ఉద్యమంలో ఓడలపై ఎర్రజెండా ఎగురవేసి నిరసన తెలిపిన ఘనత కమ్యూనిస్టు పార్టీకే దక్కుతుందన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, దున్నేవారికే భూమి అనే నినాదంతో రక్త తర్పణం చేసిన ఘనత కమ్యూనిస్టుపార్టీకే దక్కుతుందని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సంజీవప్ప, కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, శ్రీరాములు, రాజారెడ్డి, కేశవరెడ్డి, పద్మావతి, మాజీ ఎంపిపి గిరిజ, నియోజకవర్గ కార్యదర్శి గోపాల్ తదితరులు, పాల్గొన్నారు.



చేగువేరా పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

సహకార సంఘాల ద్వారా రైతులకు మెరుగైన సేవలు

సహకార శాఖ జిల్లా అధికారి కృష్ణానాయక్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

రైతుల సంక్షేమానికి వారి అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నేతృత్వంలో ప్రాథమిక సహకార పరపతి సంఘాల ద్వారా మెరుగైన సేవలు అందించడానికి కృషి చేస్తున్నామని జిల్లా సహకార శాఖ అధికారి కృష్ణనాయక్ తెలిపారు. కేవలం రైతుల అభివృద్ధి కోసమే ప్రాథమిక సహకార సంఘాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దాదాపు 75 ఏళ్ల క్రితమే ఈ సంఘాలను(సొసైటీ) ప్రభుత్వం ఏర్పాటు చేసి రైతులకు రుణ సదుపాయాలు కల్పిస్తోంది. ఆయా సంఘాల నుంచి ఐదు వేల మంది సభ్యులుగా ఉంటారు. ఆ సంఘాల ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు సరఫరాలతో పాటు రబీ, ఖరీఫ్ సీజన్లో అవసరమైన వారికి రుణ సదుపాయాలు కూడా కల్పిస్తారు. ఆయా సంఘాలకు కేవలం రైతుల ద్వారానే అధ్యక్షులు, డైరెక్టర్లను ఎన్నికల ద్వారా ఎన్నుకుంటారు. ఈ పాలకవర్గం రైతుల అభ్యున్నతికి కృషి చేస్తుంది. పంటల పెట్టుబడికి, వ్యవసాయానికి ఆ సంఘాలు రుణాలు అందిస్తాయి. చాలామంది రైతులు ఈ సంఘాల ద్వారానే రుణాలు పొందుతారు. కొన్ని సంఘాల ఆధ్వర్యంలో సహకార బ్యాంకులు ఏర్పడ్డాయి. పాలకవర్గం సిఫారసుతో సహకార బ్యాంకులో రుణాలు అందిస్తారు. అతివృష్టి, అనావృష్టితో ఇబ్బందులను ఎదుర్కొంటున్న రైతుల కోసం మరిన్ని సేవలు అందించడానికి కంప్యూటరైజేషన్ చేపట్టారు. దీంతో ఇకపై ఆన్ లైన్ ద్వారా సేవలు అందించవచ్చు. ఉమ్మడి వ్యవసాయం, ఉమ్మడి వ్యాపారాలను రైతులు చేసుకునే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో రైతులకు అందిస్తున్న సేవలపై జిల్లా సహకార శాఖ అధికారి కృష్ణనాయక్ ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో పలు అంశాలను వివరించారు.

ప్రశ్న : జిల్లాలో ఎన్ని ప్రాథమిక సహకార సంఘాలు ఉన్నాయి? ఎంతమంది సభ్యులు ఉన్నారు?

జవాబు : జిల్లాలో 54 ప్రాథమిక సహకార పరపతి సంఘాలు ఉన్నాయి. అందులో 1.96 లక్షల మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. రైతులందరితో ఈ కేవైసీ చేయించి కంప్యూటరీకరణ చేస్తున్నాము. ఈ పని మరో 10 రోజులలో పూర్తి కానుంది. దీంతో రైతులకు ఆన్ లైన్ ద్వారా మెరుగైన సేవలు అందించడానికి అవకాశం ఉంటుంది.

ప్ర : రైతులకు సంఘాల ద్వారా అందిస్తున్న సేవలు వివరించండి?

జ : రైతులకు గతం నుంచి పంట పెట్టుబడికి, వ్యవసాయానికి అవసరమైన రుణాలు అందిస్తున్నాము ప్రస్తుతం ఉమ్మడిగాను, వ్యక్తిగతంగా కూడా రైతుల అభివృద్ధికి తగు చర్యలు తీసుకుంటున్నాం. ఉమ్మడి వ్యాపారాలు చేసుకునే రైతులకు ఉపయోగపడే విధంగా సహకారం అందించడం జరుగుతుంది. ఉమ్మడిగా ఎరువుల అమ్మకం, పాల డైరీ, పాల ఉత్పత్తులు, పాడి పశువులు, ట్రాక్టర్లు, గ్యాస్ కనెక్షన్, పెట్రోల్ బంక్ నిర్వహణ, పచ్చి గడ్డి పెంచడం, తదితర 25 రకాల వ్యాపారాలు నిర్వహించుకుని అభివృద్ధి చెందడానికి అవకాశం కల్పిస్తున్నాం.

ప్ర : రైతుల ఉమ్మడి వ్యాపారాలకు విధానాలు ఏమిటి?

జ : సహకార సంఘాల్లో సభ్యులుగా ఉన్న రైతులు ఉమ్మడిగా రైతులకు సంబంధించిన వ్యాపారాలు చేపట్టవచ్చు. ఈ విధంగా జిల్లాలో ఇప్పటికే 18 సంఘాలు పనిచేస్తున్నాయి. ఈ వ్యాపారాలు చేపట్టడానికి రైతులు రూ.25 లక్షలు పెట్టుబడి పెడితే ప్రభుత్వం మరో రూ. 25 లక్షలు సమకూర్చుతుంది. ఇప్పటికే సోమందేపల్లి, బండ్లపల్లి సొసైటీలలో వ్యాపారాలు జరుగుతున్నాయి. వారి వివరాలు అన్ని కంప్యూటర్లో నిక్షిప్తమయ్యాయి. త్వరలోనే మిగిలిన సంఘాలకు కూడా కంప్యూటరీకరణ పూర్తి అవుతుంది. దీంతో మొత్తం వ్యవహారాలన్నీ ఇకపై ఆన్‌లైన్ ద్వారా జరుగుతాయి. రైతులకు ఉపయోగపడే విధంగా సేవలు కొనసాగుతాయి. వ్యాపార నిర్వహణలో అవసరమైన శిక్షణను కూడా రైతులకు ఇవ్వడం జరుగుతుంది. రైతులకు ఉమ్మడి వ్యాపారాలలో వచ్చే ఆదాయం సమంగా పంచుకోవచ్చు. ప్రభుత్వం అందించే రాయితీలు కూడా రైతులు పొందే అవకాశం ఉంటుంది.

ప్ర : రైతులకు మీరు ఇచ్చే సలహాలు ఏమిటి.?

జ : ఉమ్మడిగా లేదా వ్యక్తిగతంగా రైతులకు ఉపయోగపడే వ్యాపారాలు నిర్వహించుకోవచ్చు. సంఘాలలో ఉన్న రైతులు తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించాలి. తద్వారా మరికొన్ని సంఘాలకు రుణ సౌకర్యం కల్పించడానికి అవకాశం ఉంది. మొండి బకాయిల స్థాయికి చేరకుండా సక్రమంగా వ్యాపారాలు నిర్వహించుకోవాలి. తద్వారా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుంది. ఆయా వ్యాపారాల పర్యవేక్షణ ఆయా సంఘాల అధికారులు చూస్తుంటారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

కృష్ణానాయక్

చదువుతోనే సమాజంలో మార్పు

ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ నాయకులు - విద్యార్థులకు ప్రజ్ఞ వికాసం పరీక్ష

ప్రజాశక్తి-ఉరవకొండ

సమాజాన్ని మార్చే ప్రధాన ఆయుధం చదువు చదువు ఒక్కటే అని ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ నాయకులు అన్నారు. ఆదివారం ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్కె ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రజ్ఞ వికాసం పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ఆడిటింగ్ నెంబర్ రాజశేఖర్, మండల అధ్యక్షుడు ఉమాపతి, ట్రెజనల్ బండయ్య, ఇస్లాంబాషా మాట్లాడుతూ నేటి విద్యార్థులు పరీక్షలు అంటేనే భయాందోళనకు గురవుతూ, చదువును మధ్యలోనే నిలిపివేసే పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. ఇలాంటి నేపథ్యంలో విద్యార్థులకు కావాల్సింది నైపుణ్యత శిక్షణ అన్నారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు రాబోయే పబ్లిక్ పరీక్షలకు ప్రజ్ఞ వికాస పరీక్ష దోహదపడుతుందన్నారు. ప్రపంచీకరణ విధానాలకు లోబడకుండా భవిష్యత్తు లక్ష్య సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ సీనియర్ నాయకులు వేణు మాట్లాడుతూ పరీక్షల్లో ఎలాంటి భయాందోళనకు గురికాకుండా ఏకదృష్టితో మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఉన్నత స్థాయికి ఎదగాలని మారుతున్న విద్యారంగంతో విద్యార్థుల దృష్టిని మళ్లించే ప్రయత్నాలు పాలక ప్రభుత్వాలు చేపడుతున్నాయన్నారు. అలాంటి భ్రమలకు లోబడకుండా శాస్త్రీయ విద్యతో మెలగాలన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సిద్ధు మాట్లాడుతూ విద్యార్థులు, విద్యారంగ సమస్యలతోపాటు విద్యార్థుల నైపుణ్యతను పెంచి, బంగారు భవిష్యత్తు కోసం ఉన్నత చదువులకు ప్రోత్సహించేటట్లుగా వికాస పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు సోము, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు నందు, హరుణ్ రషీద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజ్ఞ వికాసం పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.నరసింహులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను సత్వరమే అమలు చేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు ఎన్.రఘురామిరెడ్డి, రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.నరసింహులు డిమాండ్ చేశారు. ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్ అధ్యక్షతన ఆదివారం నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరునెలలు పూర్తి కావచ్చినా 13వ పిఆర్‌సి కమిషన్ నియామకంగానీ, ఇంటీరియం రిలీఫ్ ప్రకటన, డిఎ బకాయిలు, సరెండర్ లీవుల నగదు, పిఎఫ్ ఎపిజిఎల్ఐ తదితర లోన్ల సమస్యలు పరిష్కరించిన పాపానపోలేదన్నారు. కనీసం సంక్రాంతికైనా ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీపి కబురు అందిస్తారని ఎంతో ఆశతో ఉన్నారన్నారు. కావున కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.పాతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్, జిల్లా పూర్వ అధ్యక్షులు బి.వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు దేశాయి నాగరాజు, మోహన్‌రెడ్డి, సతీష్‌కుమార్, బొమ్మయ్య, కార్యదర్శి చెన్నకేశవులు, రాష్ట్ర కౌన్సిలర్ సర్దార్‌వలి, రమణ, తలారి కృష్ణ, ఆడిట్ కమిటీ కన్వీనర్ కె.వన్నప్ప, సాంస్కృత కమిటీ కన్వీనర్ జి.గురురాజు, జిల్లా నాయకులు గోరంట్ల శ్రీనివాసులు, రామకృష్ణ మేలుకుంట రవి, సంగప్ప, ఓబన్న, గోవర్ధన్, చిదంబరరెడ్డి, నజీర్, నారాయణస్వామి, ధనుంజయ, శ్రీనివాసులు, మన్సూర్, సుహేల్, ఆదినారాయణరెడ్డి, పవన్, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు రఘురామిరెడ్డి

స్ఫూర్తి ప్రదాత అనంత వెంకటరెడ్డి

వర్ధంతి కార్యక్రమంలో వైసిపి నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం

నేటి తరం రాజకీయ నాయకులకు అనంత వెంకటరెడ్డి స్ఫూర్తి ప్రదాత అని పలువురు ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు కొనియాడారు. అనంత వెంకటరెడ్డి వర్ధంతి సందర్భంగా బుక్కరాయసముద్రం మండలంలోని రోటరీపురం వద్ద ఉన్న ఘాట్ వద్ద ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఉన్న అనంత వెంకటరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా అనంత వెంకటరెడ్డి తనయుడు, వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ప్రజల కష్టాలు, రైతాంగ సమస్యల పరిష్కారానికి అనంత వెంకటరెడ్డి చూపిన చొరవ, చేసిన కృషి మరువలేనిదన్నారు. ఆయన ఆశయాలు కొనసాగిస్తామన్నారు. జిల్లాలో కరువు నివారణ కోసం డీపీఏపీ పథకాన్ని తీసుకొచ్చారని గుర్తు చేశారు. రాజకీయాల్లో వివాద రహితుడిగా ఉండడం చాలా అరుదని, కానీ అలాంటి ఘనతను అనంత వెంకటరెడ్డి సొంతం చేసుకున్నారన్నారు. ఈతరం రాజకీయ నాయకులకు ఆయన ఆదర్శప్రాయులన్నారు. హంద్రీనీవా తీసుకురావడానికి కృషి చేశారని, అందుకే వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎం కాగానే హంద్రీనీవాకు అనంత వెంకటరెడ్డి పేరును పెట్టారన్నారు. ఫ్యాక్షన్ భయంకరంగా ఉన్న రోజుల్లో కూడా వాటి జోలికి వెళ్లకుండా, ప్రోత్సహించకుండా శాంతిభద్రతలకు సహకరిస్తూ రాజకీయాలు చేశారన్నారు. జిల్లాకు ఆయన చేసిన సేవలు ఎన్నటికీ గుర్తుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు విశ్వేశ్వరరెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి, మాజీ ఎంపిలు తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ మహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, అహుడా మాజీ ఛైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, వైసిపి టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యుడు రమేష్‌గౌడ్, రజక కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ మీసాల రంగన్న

అనంత వెంకటరెడ్డి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కంకర తేలిన తారు రోడ్డు

రోడ్లన్నీ గుంతలమయం

ప్రమాదాల బారిన వాహనదారులు

పట్టించుకోని పంచాయతీ రాజ్ అధికారులు

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే పంచాయతీ రాజ్ రోడ్లన్నీ గుంతలమయం అయ్యాయి. దీనికితోడు రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు పెరిగిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా చింతకుంట నుంచి కడవకల్లు, నారాయణరెడ్డిపల్లి నుంచి సాంబమేకలు, పుట్లూరు నుంచి తక్కలపల్లికి, తక్కలపల్లి నుంచి గార్లపాడు వెళ్లే రహదారులతోపాటు వివిధ గ్రామాలకు వెళ్లే దారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. 2010లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో మాజీమంత్రి శైలజానాథ్ ఆధ్వర్యంలో ఆయా రోడ్లు వేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రోడ్లకు మరమ్మతులు చేయకపోవడంతో రోడ్లన్నీ గుంతలు పడటంతోపాటు రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు పెరిగాయి. ఫలితంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఓ వైపు సిఎం చంద్రబాబు సంక్రాంతి నాటికి పల్లె రోడ్లన్నీ బాగుచేయాలని చెబుతున్నా... క్షేత్రస్థాయిలో మాత్రం అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామాలకు వెళ్లే రహదారులను మరమ్మతులు చేయించడంతోపాటు రోడ్లకు ఇరువైపులా కంపచెట్లను తొలగించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గుంతలు పడిన రహదారి

ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-రాయదుర్గం

సంక్రాంతి పండుగ సందర్భంగా ఆదివారం పట్టణంలోని హాటకేశ్వర స్వామి ఆలయంలో రాజరాజేశ్వరి మహిళా మండలి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో 22 మంది మహిళలు బాలికలు పోటీలో పాల్గొన్నారు. ఉపాధ్యాయినులు అనురాధ, శ్రీదేవి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. సీనియర్ విభాగంలో యమున, సుష్మ, భారతి, జూనియర్ విభాగంలో చైత్ర, కీర్తన, తనుశ్రీ, తొలి మూడు స్థానాలను సాధించారు. విజేతలకు, పాల్గొన్న వారికి బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా న్యాయనిర్ణేతలు మాట్లాడుతూ సంక్రాంతి ప్రాముఖ్యతను వివరించారు. మహిళలు అన్ని రంగాలలో ముందుకు ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షులు విమల ప్రధాన కార్యదర్శి సరస్వతి, గౌరవాధ్యక్షులు సునంద, స్వకులసాలి సమాజ అధ్యక్షులు వెంకటేశులు కార్యదర్శి లక్ష్మీనారాయణ, విద్యావర్ధక సంఘం అధ్యక్షులు ఆనందరావు, మహిళా మండలి సభ్యులు మహిళలు బాలికలు పాల్గొన్నారు.

ముగ్గులు వేస్తున్న మహిళలు

చోరీ కేసును ఛేదిస్తాం : సిఐ

ప్రజాశక్తి-శింగనమల

మండల కేంద్రంలోని చెరువు కట్టపై వెలసిన దుర్గాంజనేయ స్వామి దేవస్థానంలో జరిగిన దొంగతనం కేసును త్వరలోనే ఛేదిస్తామని సిఐ కౌలుట్లయ్య తెలిపారు. శుక్రవారం దుర్గాంజనేయస్వామి ఆలయంలో చోరీ జరిగిన విషయం తెలిసిందే. ఎస్పీ, అనంతపురం రూరల్ డీఎస్పీ ఆదేశాల మేరకు ఘటనా స్థలాన్ని సిఐ కౌలుట్లయ్య, ఎస్ఐ విజయ్‌కుమార్ పరిశీలించి వివరాలు సేకరించారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం బృందం పరిశీలించి వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ చోరీలో దుర్గమ్మ తల్లి ఆలయంలో కిలో వెండి నగలు, ఆంజనేయ స్వామి ఆలయంలో మూడు కిలోల వెండి నగలు అపహరించినట్లు తెలిపారు. స్వాములవారి వెండి నగలతోపాటు అమ్మవారి ఇత్తడి ఉత్సవ విగ్రహాన్ని కూడా చోరీ చేశారన్నారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని తెలిపారు.

డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఇద్దరికి గాయాలు

పెద్దవడుగూరు : మండలంలోని గుత్తి అనంతపురం సమీపంలో 44వ జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. మరో ఇద్దరు గాయపడినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ ప్రాంతానికి చెందిన సయ్యద్ శిబ్బుతుల్లా (37) బంధువులైన సయ్యద్‌హసిన్, సయ్యద్‌తో కలిసి హైదరాబాద్ నుంచి బెంగళూరుకు కారులో వెళ్తుండగా గుత్తి వద్దకు రాగానే టైర్ పంక్చర్ అయింది. దీంతో టైరు మార్చుకుని కారు ఎక్కే సమయంలో వెనుక వైపు నుంచి వచ్చిన ఐచర్ ఢీకొంది. దీంతో సయ్యద్ శిబ్బుతుల్లా అక్కడికక్కడే మృతిచెందాడు. ఇద్దరు గాయపడ్డారు. మృతిచెందిన వ్యక్తికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నట్లు తెలిపారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మృతిచెందిన సయ్యద్ శిబ్బుతుల్లా

భార్య మృతిని జీర్ణించుకోలేక భర్త ఆత్మహత్య

పెద్దపప్పూరు : భార్య మృతిచెందడాన్ని తట్టుకోలేని ఓ భర్త ఆత్తహత్య చేసుకున్న ఘటన ఆదివారం మండల పరిధిలోని సింగనగుంటపల్లిలో చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల మేరకు... 20రోజుల క్రితం కుటుంబ కలహాలతో సింగనగుంటపల్లి గ్రామానికి చెందిన నారాయణస్వామి భార్య ఆత్మహత్య చేసుకుంది. అప్పటి నుంచి నారాయణస్వామి మానసికంగా ఇబ్బంది పడేవాడు. ఈనేపథ్యంలో ఒంటరితనాన్ని జీర్ణించుకోలేక శనివారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతిచెందినట్లు తెలిపారు. 20రోజుల వ్యవధిలో భార్యాభర్తలు మృతిచెందడంతో ఇద్దరు పిల్లలు అనాథలుగా మిగిలిపోయారు.

కర్నాటక మద్యం స్వాధీనం

బెలుగుప్ప : మండల కేంద్రంలోని బీసీ కాలనీలో బోయ అనిల్ అక్రమంగా కర్ణాటక మద్యం టెట్రా పాకెట్లను అమ్ముతుండగా పట్టుకున్నట్లు ఎస్ఐ శివ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు... బోయ అనిల్ తన ఇంట్లో అక్రమంగా అమ్ముతున్న కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా దాడి చేసి 70 ఐ వార్డ్స్ టెట్రా పాకెట్లను స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసుకుని రిమాండ్ తరలించినటుల తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది బాల నరసింహులు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం వివరాలను వెల్లడిస్తున్న ఎస్ఐ శివ

ఘర్షణలో వ్యక్తికి గాయాలు

పుట్లూరు : వ్యవసాయ తోట వద్ద ఘర్షణ పడి ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధిలోని తక్కలపల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తక్కలపల్లి గ్రామానికి చెందిన సుధాకర్, గురువయ్యలు గతంలో గొడవపడ్డారు. ఈ గొడవల్లో ఇప్పటికే సుధాకర్ జైలుకు కూడా వెళ్లి వచ్చాడు. జైలు నుంచి బెయిల్‌పై ఇంటికి వచ్చిన తర్వాత సుధాకర్ తన పొలంలో పనులు చేసుకుంటుండగా గురువయ్య, కొడుకు, భార్య కలిసి కొడవలి, రాడ్లతో కొట్టారు. దీంతో సుధాకర్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే బంధువులు తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా ఘర్షణలో గాయపడి అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుధాకర్‌ను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పరామర్శించారు. ఇందులో భాగంగా ఘర్షణపై ఆరాతీశారు. కుటుంబ సభ్యులను ఓదార్చి భరోసా కల్పించారు.

ఘర్షణలో గాయపడిన సుధాకర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

జూదరుల అరెస్టు

యల్లనూరు : మండల పరిధిలోని బుక్కాపురం గ్రామంలో ఆదివారం జూదం ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో దాడి చేసి జూదరులను అరెస్టు చేసినట్లు సిఐ సత్యబాబు తెలిపారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు బుక్కాపురం గ్రామంలో జూదం ఆడుతున్నట్లు తెలుసుకుని ఎఎస్ఐ సంపత్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ శంకర్‌నారాయణ, పోలీసులు దాడి చేసి ఐదుగురు నిందితులను అరెస్టు చేసి రూ.5,550 స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

నారా లోకేష్ అభిమాన సంఘం జాతీయ అధ్యక్షులు జె.ఆనంద్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంతకల్లు

రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి నారా లోకేష్ అభిమాన సంఘం జాతీయ అధ్యక్షులు జె.ఆనంద్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కూడలిలో ఉన్న ఓ ప్రయివేటు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి తనకు చెందిన బస్సుల దగ్ధం విషయంలో కూటమి ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. అదేవిధంగా సంఘటనపై టిడిపి, బిజెపి నాయకుల మధ్య నడుస్తున్న మాటలు యుద్ధానికి వారు ముగింపు పలకాలని సూచించారు. బిజెపి నాయకురాళ్లు మాధవీలత, యామినీశర్మ కూడా ఈ విషయంపై సున్నితంగా మాట్లాడి ఉంటే బాగుండేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. జెసి ప్రభాకర్‌రెడ్డి 40 ఏళ్ల రాజకీయంగా ప్రజా జీవితంలో ఉంటూ తాడిపత్రిని ఆదర్శంగా తీర్చిదిద్దారని గుర్తు చేశారు. రాష్ట్రంలోనే తాడిపత్రిని ఆదర్శ నగరంగా తీర్చిదిద్దారని తెలిపారు. అలాగే బిజెపి ప్రభుత్వం కూడా రాష్ట్ర అభివద్ధికి తన వంతు తోడ్పాటు అందిస్తోందన్నారు. ఈ సమావేశంలో నారా లోకేష్ అభిమాన సంఘం సభ్యులు శ్రీకాంత్, నారాయణ, కదిరప్ప పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న నారా లోకేష్ అభిమాన సంఘం జాతీయ అధ్యక్షులు జె.ఆనంద్‌రెడ్డి

మిత్రులు, గురువులను కలవడం ప్రత్యేక అనుభూతి

ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

సమ్మేళనం ద్వారా పాత మిత్రులు, గురువులను కలవడం ప్రత్యేక అనుభూతిని ఇస్తుందని ఎంపి అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం నగరంలోని ఎస్ఎస్‌బిఎన్ కళాశాలలో పూర్వ విద్యార్థులు, అధ్యాపకుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ ప్రతి మనిషి జీవితంలో తాము చదువుకున్న కళాశాలలో ఆత్మీయ సమ్మేళనం ద్వారా పాత మిత్రులు, గురువులను కలవడం ఎంతో ప్రత్యేకమైన సంతోషాన్ని ఇస్తుందన్నారు. ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా మన కళాశాలకు తమవంతు సహాయ, సహకారాలు అందించే అవకాశం ఉంటుందన్నారు. ఇవి నిరుపేద విద్యార్థులకు చదువుకోవడానికి మరిన్ని అవకాశాలను కల్పిస్తాయన్నారు. అనంతరం అప్పట్లో చదువులు చెప్పిన గురువును సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ పిఎల్ఎన్.రెడ్డి, సెక్రటరీ నిర్మలమ్మ, పదవీ విరమణ పొందిన చీఫ్ కమర్షియల్, ఇన్కమ్ టాక్స్ అధికారి నరసింహప్ప, రమేష్‌బాబు, నాగభూషణం, ప్రభాకర్, శివచంద్ర, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపి అంబికా లక్ష్మీనారాయణ

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు 'పాముదుర్తి' ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి-బుక్కపట్నం

మండలంలోని పాముదుర్తి గ్రామ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న హనుమంతు జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మూడు పతకాలు సాధించాడు. ఆయన క్రీడల్లో గెలుపు, ఓటములకు వయసుతో సంబంధం లేదని చాటి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికై యువతకు ఆదర్శంగా నిలిచారు. మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలోని జెఎన్‌టియు ఇంజినీరింగ్ కాలేజీ మైదానంలో నిర్వహించిన అథ్లెటిక్స్ సెలక్షన్స్‌లో 40 ఏళ్లు పైబడిన వారికి నిర్వహించిన 100 మీటర్ల రన్నింగ్ రేస్ హనుమంతు బంగారు పతకం, 800 మీటర్ల విభాగంలో కాంస్యం, షార్ట్‌పుట్‌లో రజత పతకం సాధించి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించిన ఉపాధ్యాయుడు హనుమంతును అనంతపురం ఎంపి అంబికా లక్ష్మీనారాయణ, మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.సుధాకర్‌బాబు, ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యాయులు అభినందించారు.

సమస్యాత్మక గ్రామాల్లో పోలీసుల పల్లెనిద్ర

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు పోలీసులు జిల్లావ్యాప్తంగా సమస్యాత్మక గ్రామాల్లో పల్లెనిద్రలు చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామస్తులతో మాట్లాడి తాజా పరిస్థితులపై ఆరా తీశారు. సమస్యలు తీవ్రం కాకుండా మొగ్గదశలో తుంచేసేలా చర్యలు తీసుకుంటున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపైకఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరైనా గొడవలకు పాల్పడినా, అసాంఘిక కార్యకలాపాలకు జోలికెళ్లినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నియణ, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, మత్తు పదార్థాల అనర్థాలు, సైబర్ మోసాలు గురించి అవగాహన చేశారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే 1930కి కాల్ చేసి సమాచారం అందించాలని ప్రజలకు అవగాహన కలిగించారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మహారాజ శ్రీ కర్నూలు 4వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ప్రొహిబిషన్ & ఎక్సైజ్ (P&E)

O.S.No.995/2022

కె.వెంకట సుబ్బారెడ్డి. ...వాది

-Vs-

టి.దుర్గాబాయ్ భర్త టి.శ్రీనివాసరావు
ఇంటి నెం.86/352, డాక్టర్స్ కాలని,
బి.క్యాంప్, కర్నూలు. ప్రస్తుతం ఇంటి నెం.17,
మిస్‌విలాస్, (Mies Villas) S.Y.No-156/1,
రుద్రంపేట పంచాయితి, సాక్షి ఆఫీస్ ఎదురగా,
ఎన్.హెచ్.44, అనంతపురం - 515004.

ప్రతి వాదికి దావా సమన్సు

పై నెంబర్ దావాలో వాది, ప్రతివాది నుండి దావా మొత్తము రూ॥1,71,025-00లు ముందు వడ్డి 24% P.A ప్రకారము మరియు కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినాడు. ఇందులో ప్రతివాది అయిన నీకు ఆక్షేపణలు ఉన్న 28-02-2025 తేదిన పగలు 10.30 గం॥లకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలయును. లేని యెడల నీపరోక్షమున విచారించి తీర్మానింపబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది : 28-02-2025

ఇస్కాల శ్రీనివాసులు,
వాదిపరం అడ్వకేటు, కర్నూలు.
సెల్ : 9866409704

ఉచిత గుండె వైద్యశిబిరం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులో ఉన్న రజాక్ ఫంక్షన్ హాల్ ఎదురుగా నూతనంగా నిర్మించిన 'అమృత హెల్త్ కేర్ క్లినిక్' ఆధ్వర్యంలో మార్క్ ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం ఉచిత గుండె వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా అమృత హెల్త్ కేర్ క్లినిక్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అమృత, డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ మార్క్ ఆసుపత్రి సౌజన్యంతో ఉచితంగా గుండె వైద్యశిబిరం నిర్వహించినట్లు చెప్పారు. ఈ శిబిరంలో ఉచితంగా రక్త పరీక్షలు ఇసిజి పరీక్షలు నిర్వహించారు. గుండె సమస్యలు ఉన్నవారికి మార్క్ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా 2డి, ఎకో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమృత క్లినిక్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ నాగరాజు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాల ఆవరణలో 1986-87వ సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. దాదాపు 38ఏళ్ల తర్వాత అందరూ కలుసుకోవడంతో పలువురు భావోద్వేగానికి గురయ్యారు. అనంతరం చదువుకునేటప్పుడు విద్యాబోధన చేసిన గురువులు సంజీవరెడ్డి, నాందేవ్, కృష్ణారెడ్డి, తిరుపాలు, నారాయణస్వామి, మబూను ఘనంగా సత్కరించారు. తర్వాత పాదాభివందనం చేశారు. ఒకరికొకరు కుశల ప్రశ్నలు వేసుకుని వివరాలను ఆరాతీస్తూ ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రమౌళి, గవ్వల శ్రీరాములు, ప్రతాప్‌చౌదరి, ముస్తఫ, మహేష్, మిద్దె కుల్లాయప్ప, వెంకటరాముడు, గొల్ల శీనా, ఈడిగ రవీంద్ర, ఆవాల భాస్కర్, భాస్కర్‌రెడ్డి, నాగరాజు, హనుమంతురాయుడు, బింగి శీనా, దామోదర్, నరసింహులు మహబూబ్‌బాషా, కొత్తమిద్దె ఆది, తలారి శంకర్, నడిమిదొడ్డి లక్ష్మీరెడ్డి, సుధాకర్, రఫీ, జిలాన్, బుల్ల మసూద్, రహామత్ బి, ముంతాజ్, అచ్చమ్మ, పద్మజ, గోపిక, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొననారు...

ఒకచోట చేరిన పూర్వ విద్యార్థులు